
# అందమంటే...

## ఎం. వెంకటేశ్వరరావు



"పాలు తీసుకోండి" అన్న లక్ష్మి మాటలు విన్పించనట్టు...పక్కకు జరగబోతున్న సూర్యాన్ని చేత్తో పట్టుకొని...

'నేనంటే...ఇష్టం లేకుండా పెళ్ళికి ఎందుకు ఒప్పుకున్నారు...? లోపలి కొచ్చి అరగంట దాటుతున్నా...ఆమడ దూరంలోనే నిలబెడుతున్నారు' ... అంది గద్గద మౌతున్న గొంతుతో.

'నేనే...నీకు తగనేమో"... అప్పుజెప్పినట్టన్నాడు.

"ఇప్పుడు రావాల్సిన 'డౌటా'...ఇది?"

"ఎప్పుడో వచ్చింది"... అందామనుకున్న సూర్య మనస్సు పెళ్ళిచూపుల గతంలో కెళ్ళింది.

\+ + +

ముందుగదిలో వేసిన కుర్చీల్లో సూర్యం., బాబాయి గంగాధరం...చాపమీద సూర్యం తల్లి, పినతల్లి కూచున్నారు.

కుశల ప్రశ్నలయిన తర్వాత...గంగాధరానికి వంశ చరిత్ర చెప్తున్నాడు...పిల్ల తండ్రి కృష్ణమూర్తి...

'వెళ్ళి ఫలహారాలు పట్రా"... నుంచున్న భార్య నాదేశించాడు.

"ఆ...ఆగండి ...కలికితే ...అతకదంటారు ... ముందు అమ్మాయిని చూపించండి"...అన్నాడు గంగాధరం.

వెళ్లబోతున్న...కృష్ణమూర్తి భార్య కాళ్లకు బ్రేకులు పడ్డట్టాగింది.

"అలానే" ... అంటూ అమ్మాయిని తీసుకు రమ్మన్నట్టు... కళ్లతోనే భార్య నురికించాడు కృష్ణమూర్తి.

మరో అయిదు నిమిషాల తర్వాత... ముందు గదిలో కొచ్చిన అమ్మాయిని చూసి... రెప్పలార్పడం మరిచిపొయ్యాడు సూర్యం. సాదాచీర కట్టుకున్న వీనస్ బొమ్మలా వుందామె. అందరికీ నమస్కారం చేసి ... చాపమీద కూచుంది.

"పేరేమిటమ్మా"... గంగాధరం ప్రశ్న.

"శ్రీలక్ష్మి"... కృష్ణమూర్తి జవాబు.

"ఏం చదువుకున్నావమ్మా"... పినతల్లి ప్రశ్న...

"ఇంటరు"... కూతురి కవకాశమివ్వకుండానే కృష్ణమూర్తి జవాబు.

"వంట చెయ్యటం"... సూర్యం తల్లి ప్రశ్నకు కృష్ణమూర్తే ఎక్కడ బదులిస్తాడోనని...

"అమ్మాయిని చెప్పనివ్వండి ... కంఠం వింటాం"... నవ్వుతూనే అన్నాడు గంగాధరం.

"వచ్చండీ"... వంచిన తల ఎత్తకుండానే బదులిచ్చింది లక్ష్మి.

"సంగీతంలో ఏమైనా ప్రవేశం"... గంగాధరం కంప్లీట్ చెయ్యక ముందే...

"రాదండీ"... అనేసింది.

"అమ్మాయికి నేర్చుకోవాలన్న ఆసక్తి... నాకు చెప్పించాలన్న తాపత్రయం ... కానీ ఈ పల్లెటూళ్లో చెప్పే వాళ్లెవరూ లేరండీ"

ఆమె వైపే కన్నార్పకుండా చూస్తున్న సూర్యాన్ని మనసు ప్రశ్నించింది.

"తంతే గారెల బుట్టలో పడ్డావు"... ఆమెకు నువ్వు నచ్చితే ఒప్పేసుకో."

"ఆశకైనా అంతుండాలి. ఆమె అందం ఎక్కడ ... నల్లగా, స్ఫోటకపు మచ్చల నీ మొహమెక్కడ" ... బదులిచ్చింది అంతరంగం. పది నిమిషాల అంతర్మథనానంతరం ... మనసుకే ఓటేశాడు సూర్యం.

అంతలో లక్ష్మి కాఫీ ట్రేతో రావడంతో ... ఆలోచనలకు ఆనకట్టేసి ... గ్లాసందుకుంటూ ఆమె వైపు చూశాడు. ఆమె తనవైపు కన్నెత్తి కూడా చూడకుండా వెళ్లడంతో...

"పిచ్చి మనసు ఆశపడ్తోంది గానీ ... ఆమెకు తను నచ్చడమేమిటి"... సర్ది చెప్పుకున్నాడు తనకు తానే ...

కాఫీలయ్యాక..."మరిసెలవిప్పించండి"... లేచాడు గంగాధరం.

గుమ్మం దాకా వచ్చిన కృష్ణమూర్తి ..."అబ్బాయికి అమ్మాయి నచ్చిందీ ... లేనిదీ తెలిస్తే ... మిగిలిన విషయాలు ..."

"వెళ్ళిం తర్వాత లెటర్ రాస్తాం లెండి"... మగపెళ్ళి వాళ్లగాంభీర్యం ఒలికించాడు గంగాధరం.

"అయినా అబ్బాయి నోమాట కనుక్కుంటే .." సూర్యం వైపు చూశాడు గంగాధరం.

సంకటంలో పడ్డది ... సూర్యం మనస్సు అవకాశం కోసం ఎదురు చూస్తున్న అతని అంతరంగం నోరు మెదిపింది.

"పట్ట పగలే... పుట్టు మచ్చ లెక్కడున్నదీ .... టార్చేసుకుని వెతకాల్సిన నీ మొహానికి ... కారు చీకట్లో కూడా కొట్టొచ్చినట్టు కన్పించే ఆమె అందం కావాల్సొచ్చిందా?"...

అప్పటి వరకూ మౌనంగా విన్న మనసు...

"అవకాశాలందరికీ రావు... అందమైన అర్థాంగి ఎదురొస్తుంటే వద్దని తర్వాత పశ్చాత్తాపపడ్డా... లాభం లేదు ... ఒప్పేసుకో... ఒప్పేసుకో... ముందు కురికించింది.

"బాబాయ్... నాకు ఆ అమ్మాయి... నచ్చడంలో ఆశ్చర్యం లేదు... కానీ... నేనామెకు నచ్చానో... లేదో"... బయటపెట్టాడు సూర్యం.

"మీకా సందేహమే అక్కర్లేదు. లక్ష్మి నేను గీచిన గీత దాటదు." మాటల్లోనే తనెంత చండ శాసనుడో... వ్యక్తపరిచాడు గర్వంగా కృష్ణమూర్తి.

"ఇదేమన్నా వెనకటి కాలమటండీ... కల్సి కాపురం చెయ్యాల్సింది వాళ్ళిద్దరూ ... ఏక పక్ష నిర్ణయం తీసుకోవడం మంచిది కాదు... పెళ్లి అమ్మాయి అభిప్రాయం తెల్సుకురండి" అన్న గంగాధరం మాటకు మారు మాట్లాడకుండా లోపలి కెళ్లిన కృష్ణమూర్తి ... మరో రెండా నిమిషాల తర్వాతొచ్చి...

"నే చెప్పలేదుటండీ ... అమ్మాయి నామాట కెదురు చెప్పదని ... అమ్మాయికి పరిపూర్ణ సమ్మతమే."

"మరింకేం శుభస్య - శీఘ్రం " అన్నాడు గంగాధరం ...

స్పానర్లూ, స్టీరింగులూ పట్టుకుని పనిచేసి, చేసి .... రాయిలా వున్న తన చేతుల్ని ... తమల పాకుల్లాంటి ఆమె అరచేతులు తాకుతుంటే... ఏదో లోకాలకు మనసు పయనిస్తున్నా ... కిటికీ లోంచి పడే చంద్రుని వెలుగులో... పద్మాల్లాంటి ఆమె చేతుల్లో ఇమడని... నల్లని తన చేతుల్ని చూసిన సూర్యం చేతుల్ని వెనక్కి లాక్కున్నాడు.

"చెప్పండి ... నేనంటే ... ఇష్టం లేదా?"... మళ్ళీ అడిగింది లక్ష్మి" అని నేనన్లేదే"...

"మరి?"...

"అడుగుతున్నానని ఏమీ అనుకోకు ... నన్ను మనస్ఫూర్తిగానే నీజీవితంలోకి ఆహ్వానించావా?"

"అదే ప్రశ్న నేనూ అడుగుతున్నాను"...

"నాలోఏంచూసి... ఈపెళ్లికి ఒప్పుకున్నావు"

"అంటే?!?" అర్థంగానట్టందామె.

"అందమా?... ఉద్యోగమా...?"

"పెళ్లికి ఇవే ముఖ్యమా?"

"సహజంగా ప్రతి ఆడపిల్లా కోరుకునేది ... ఆ రెంటినే గదా?"...

"ఓహో... అందం ... అంటే?"...

"ఒకసారి చూస్తే మళ్లీ మళ్లీ చూడాలన్పిం చేదని ... ఎక్కడో చదివాను"...

"కానీ ... రోజు రోజుకీ ఎండి పండి పోయే బాహ్యపుటందంకన్నా అంతరంగపుటందమే... అద్భుతమైనదని ... నేననుకుంటున్నాను... నిశ్చింతగా అందామె.

"మరి చదువంటే ...?"... మళ్లీ తనే అడిగిం దతన్ని...

"చదువుంటే... మంచి ఉద్యోగం... హోదా ?'

"చదువు వల్ల సంస్కారం... సంస్కారం వల్ల లభించే హోదా పెళ్లికి ముఖ్యం గానీ... కేవలం ఉద్యోగం వల్లే హోదా... సంస్కారం... ఇంకా మీరనుకునే వన్నీ వస్తాయని నేననుకోవటం లేదు. ఉద్యోగస్థులంతా... సంస్కారవంతులు కానట్లే... సంస్కార వంతులు ఉద్యోగస్థులు... కానక్కర్లేదు. ఎదుటి మనిషిని అర్థం చేసుకోగలిగే.... సంస్కార వంతమైన ప్రవర్తనే ... మనిషికి అందాన్నీ....హోదాను పెంచుతుంది."

"........................"

"మీరింకా దేన్ని గురించో ఆలోచిస్తూనే ఉన్నారు ... చూడండి ... భార్యా భర్తలు మనసు లోతుల్లో... ఒకరికొకరు చూసుకోవాలే తప్ప...పైపై అందాలకు ప్రాధాన్యాన్నిచ్చి .... ఎంతకాలం మనుగడ సాగించగలరు ... చెప్పండి ..."

"మీకన్నా రంగూ, రూపాల్లో... అందగాళ్లే ... ఉద్యోగం..., హోదా ఉన్న వాళ్లే ... ఎంతో మంది పెళ్లి చూపులు చూసెళ్లారు ... నన్ను. కానీ యేం లాభం?...

"అమ్మాయి నచ్చింది... అబ్బాయి హోదాకు తగ్గట్టు కట్న కానుకలతో పెళ్లిచెయ్యండంటూ" ... గొంతేమ్మ కోర్కెలు కోరేవాళ్లు ...

వాళ్లడిగేవన్నీ ఇచ్చే ఆర్థిక స్థోమత కేనాడో మమ్మల్ని దూరం చేశాడు మానాన్న...

ఒకటా?... రెండా?....పెళ్లి చూపుల్తోనే పిచ్చె క్కేలా మారింది... నా పరిస్థితి.

పెళ్లి గురించి... ప్రతి ఆడపిల్లా కనే కలలన్నీ పెళ్లి చూపుల్తోనే ... కల్లలవుతున్నాయి.

మధ్య తరగతి కుటుంబాల్లో ... అబ్బాయికి అమ్మాయి నచ్చితే చాలు ... అమ్మాయి అభి ప్రాయం .... అనవసరం గానే అంచనా వేస్తారు.

కానీ ... పెళ్లి చూపులరోజున మీవైపు కన్నెత్తైనా చూడని నన్ను ...

"అమ్మాయి ... నాకు నచ్చడం ముఖ్యం గాదు ... అమ్మాయికి నేను నచ్చానో?... లేదో?... కనుక్కోండి" అన్న మీ మాటలు మీవైపు చూసేలా చేశాయి.... కళ్లతో గాదు...మనసుతో."

"కట్న కానుక లక్కర్లేదు ... కట్టుబట్టలతో పంపితే చాలని" మీరు రాసిన ఉత్తరం ... ఆలోచింపజేసింది నన్ను ... భార్యను పోషించే ధైర్యం, సత్తా మీకున్నపుడు ... మిగిలినవన్నీ... నాకు కన్పించలేదు..కన్పించిదల్లా మీ మనస్సే."

"ఇప్పుడు చెప్పండి...నేను మిమ్మల్ని మనసుతో చూస్తున్నాను ... మీరు నా శరీర అందాల్ని చూసి ... తగననుకుని మీలో న్యూనతా భావాన్ని పెంచుకుంటూ పోతే ... కల్సిజీవించాల్సిన మనం ... శారీరకంగా ఒకటవటం ఎటూ తప్పదు. .. కానీ మానసికంగా ఏకం కాకుండా శరీరాల్ని రెండాట బొమ్మలు చేసి కాసేపాడు కోవటం అవసరాల్ని తీరుస్తుందే తప్ప... అనురాగాన్ని వృద్ధిపరచదు.

ఆప్యాయత నశించిన దాంపత్యం...

పరిమళం కోల్పోయిన పుష్పం లాంటిది..." కామాలు, ఫుల్‌స్టాప్పులూ, లేకుండా మాట్లాడుతున్న లక్ష్మి ఒడిలో తనకు తెలియకుండానే... తలాన్చిన సూర్యం... పాఠం వింటున్న పిల్లాడిలా... ఆమె మాటల్ని ఆలకిస్తున్నాడు. ●

